

# పసిడిమనసులు - షర్మిల



## చిట్టెమ్మ మనవరాలు

"**చిట్టెమ్మా ! ఏంచేస్తున్నావమ్మా**" అంటా ఆచార్లు గారు అరుగు మీద కూలబడుతూ పిలిచారు.

"అయ్యో మీరు ఎందుకొచ్చారు ఎవళ్లతో కబురంపినా నేనే వచ్చేదాన్నిగా" అంటా చేసే పనిని పక్కనబెట్టి వచ్చింది .

" ఏముంది నవరాత్రులు రాబోతున్నాయిగా ... గుళ్లో ఏం చేసినా నీ చెయ్యి పడాలిగా " అంటావుండగానే తాతని చూసి "ఏం మావా పొలం నుంచా " అని పలకరించారు ఆచార్లుగారు.

మా వూళ్లో ఆచార్లుగారొక్కరే బ్రామ్మర్లు. మావూరి గుళ్లో పూజలు చేయడానికి గుడి పక్కనే ఆయనకి ఒక ఇల్లు కట్టించారు వూళ్లో వాళ్లు. అందుకే ఆచార్లుగారికి వూళ్లో వాళ్లే చుట్టాలు. అందరినీ మావా, బావా ఇట్లా వరసలు పెట్టి పిలుస్తారు. తాతకి తెలుసు తనతో ఆచార్లుగారికేం పనుండదని గుడి గోలంతా చిట్టెమ్మదేనని.

దసరా మా కుటుంబానిది కాదు మా వాటాకి వచ్చింది సంక్రాంతి అంట. మా గుడికోసం మా ముత్తాతల కాలంలో తగాదాలు పడి, తలలు పగలకొట్టుకుని కోర్టుల చుట్టూ తిరిగి బోలెడు డబ్బులు ఖర్చు పెట్టి గెలిచారంట.

మా వూరు చిన్నదే గానీ రెండు ముఠాలు. ఒకటి మునసబు గారి ముఠా రెండోది పెదెంకయ్య గారి ముఠా. పెద వెంకయ్య గారి ముఠా మాదంట. ఆ తగాదాల్లో ఎట్టా కొట్టుకున్నదీ ఎవరెట్టా కర్రలు తిప్పారో ఈనాటికీ కధలు కధలుగా చెప్పుకుంటారు.

మొత్తానికి మా ముఠాకే గుడి వచ్చిందంట. ఆ తరవాత మా ముత్తాతలు గుళ్లో చేయించాల్సిన పండగల్ని పంచుకున్నారంట.

మా ముత్తాత నాగయ్య గారికి సంక్రాంతి పండగ పంచారు. దసరా పండగ ముసలయ్య గారి కుటుంబానికి ముక్కోటి బసవమ్మ గారి కుటుంబానికి పంచారు.

కానీ మా నాయనమ్మ అన్ని పండగలకీ నేనున్నానంటా తయారవుతుంది. ఇప్పుడు పాత తగాదాలు మర్చిపోయి అందరూ గుడికొస్తన్నారు.

నవరాత్రులు మా గుళ్లో భలేగా జరుగుతాయి. భలేగా అంటే నాకు రోజూ రెండు మూడు ప్రసాదాలు దొరుకుతాయి. మామూలు రోజుల్లో ఒక్క శుక్రువారం వడపప్పు, కొబ్బరిముక్కలూ బెల్లం ప్రసాదం పెట్టి , పానకం ఇస్తారు.

అట్టాంటిది ఈ తొమ్మిది రోజులూ ఎన్నెన్ని ప్రసాదాలో. " అమ్మాయ్ ! ఈ తొమ్మిదిరోజులూ ఎవరెవరు ఏ ప్రసాదాలు చేయిస్తారో, మీరంతా మాట్టాడుకుని నాకు చెప్తే ఏమేం కావాలో సరుకులు రాసిస్తా , ముందు రోజు పొద్దునకల్లా అవి నా ఇంట్లో పడెయ్యాలి " అన్నారు ఆచార్లుగారు.

"అట్లాగేనండీ మీకెందుకు ! ముసలయ్యగారి కుటుంబం వాళ్లది మీరు చూసుకోండి. మిగతా వాళ్లు ఎవరెవరు ప్రసాదాలు చేయిస్తారో కనుక్కుని చెప్తాగా, ఈ తొమ్మిది రోజులూ రోజుకి కనీసం మూడు ప్రసాదాలు చెయ్యాల్సి వస్తంది మీకు చాకిరీ " అంది.

" పోన్లే ఆ వేణుగోపాలస్వామీ, రాజ్యలక్ష్మీ అమ్మవారి దయ, ఏదో ఇంత ముద్ద నోటికి వెళుతోంది వారి సేవ చేయడమే భాగ్యం" అన్నారు ఆచార్లుగారు.

" ఆ ఆళ్ల పేరు చెప్పుకుని తినేది మీరేగా " పెద్దనాన్న నవ్వుతా అన్నాడు. పెద్దనాన్న కమ్యూనిస్టు అంట అందుకే గుడికి రాడు కానీ నన్ను ఆచార్లుగారు అరుగుల మీద బళ్లో నన్ను చేర్పించడానికి వచ్చి " ఆచార్లుగారూ! పిల్ల మీద బెత్తం పడకూడదు మేం దాని మీద చెయ్యికూడా ఎత్తం" అని బతిమాలాడు.

"ఒరేయ్ ! ఏనాడూ గుడికి రావు..ఇప్పుడు నీ పెంపుడు కూతురి కోసం మొత్తానికి నా దగ్గర తలొంచావురో" అంటా పకాపకా నవ్వారు.

ఆచార్లు గారు కాసేపు కూర్చుని " సరే చిట్టెమ్మా వెళ్లొస్తా " అంటా లేచారు.

"ఇవి వుంచండి" అని సంచిలో మా దొడ్లో కాసిన సొరకాయ, బెండకాయలు, కేను నిండా పాలు, గిన్నె నిండా వెన్నపూస పెట్టి ఇచ్చింది. వెనకాలే వచ్చిన మేనల్లుడు అవి పుచ్చుకుని వెళ్లాడు. "వచ్చినప్పుడల్లా ఆచార్లుగారికి పందేరాలు పెడతావు" అంటా మన్నాన్న సణిగాడు.

" అబ్బాయ్ ! మీ బాబాయ్ నువ్వూ కమూనిస్టులం అంటారు. ఏం ఆచార్లు గారు బీదరికంలో లేరా ! ఆయనా ఆరుగురు సంతానాన్ని పోషించుకోవాలి ... మనం దేముడి చేను మీద ఇచ్చే కౌలు ఏ మూలకి . పెద్ద పిల్ల పెళ్లైంది ఇంకా నలుగురు ఆడపిల్లలు, ఒక మొగ పిల్లడు ఇందరి తిండీబట్టా మంచీచెడూ చూడాలి. పైగా వచ్చేవాళ్లు పోయే వాళ్లాయె ఇక ఏం తింటారు చెప్పు. ఏదో మన గుడిని నమ్ముకుని వుండే ఆయనికి మనమంతా తలో చెయ్యి సాయంచెయ్యొద్దా " అంటా ఏసుకుంది .

మొత్తానికి నవరాత్రులు మొదలెట్టారు. అందరికీ దసరా సెలవలిచ్చారు. వూళ్లనుంచి వచ్చిన పిల్లలు పెద్దలతో వూరు కళకళలాడతాంది. ఈ నవరాత్రులు జరిగినన్నాళ్లూ మేమంతా సాయంకాలం అవ్వగానే చంద్రకాంత పూలు కొయ్యడానికి బయల్దేరతాం.

సాయంత్రం అవ్వగానే రంగురంగుల్లో పూసిన చద్రకాంత పూలని బుట్టనిండా కోసి అచార్లు గారి సత్యవతికి ఇస్తే తను పూలన్నీ పెద్ద దండ కట్టి గుళ్లో అమ్మ వారికి అలంకరణకి ఇస్తంది .

రాత్రి గుడికి ఎళ్లేటప్పుడికల్లా మా అమ్మవారి అందం చూడాల్సిందే.

రోజూ అమ్మవారికి కట్టి ఇవ్వమంటా రకరకాల చీరలు అందరూ పంపుతారు. వాటిల్లో ఆయన రోజుకో రంగు చీర అమ్మవారికి కట్టి పూలదండలేస్తే భలే వుంటంది .

అసలు ఆవిడ వెండి కళ్లు, బంగారం బొట్టు ఎంత బాగుంటాయో.

మా నాయనమ్మ తన వుంగరం మార్చి అమ్మవారికి కల్యాణం బొట్టు చేయించిందంట. మద్యలో పొడుగ్గా ఎర్ర రాయి చుట్టూ తెల్లరాళ్లతో మెరిసిపోయే. బొట్టుతో మెడనిండా చంద్రకాంత పూలతో, రంగురంగుల పట్టు చీరలతో అమ్మవారు నిజంగానే పండగ చేసుకున్నట్టుంటుంది.

ఇక మా అచార్లుగారు పూజయ్యాక పెట్టే ప్రసాదాల రుచి ఇంకెక్కడా వుండదు.

పాయసం, పులిహార, దద్దోజనం ఒక రోజు , కట్టు పొంగలి, పంచ కజ్జాయం, శనగలు ఇట్లా ఈ తొమ్మిది రోజులూ ప్రసాదాలే.

దోసిడినిండా ఒక్కో ప్రసాదం పెట్టి మళ్లీ రెండో ప్రసాదం తెచ్చే సరికీ తినేస్తే మళ్లీ దోసిడి నిండా పెడతారు.

మా వూరికి కొత్తగా వచ్చిన వాళ్లకి ఈ తంతు తెలియక ఒక చేయి పట్టారో ఆచార్లు గారు గుడ్లురిమి "రెండుచేతులూ పట్టు" అని కేక లేస్తారు .

ఒక ప్రసాదం తిని పంపుదగ్గర చెయ్యి కడుక్కుని వచ్చిన వాళ్లు ఇన్ని ప్రసాదాలు తినేసరికి ఆపసోపాలు పడాల్సిందే. పొట్ట నిండా ప్రసాదాలతో ఇంటికెళ్లాల్సిందే .

"మీ వూరాళ్లంటే తిండిబోతులు, మమ్మల్ని కూడా ఇట్టా తినమని సంపితే ఎట్టా? " అని టౌన్లనుంచి వచ్చిన సుకుమారులు గగ్గోలు పెట్టేవారు .

అమ్మవారి అందమైన విగ్రహమో, ప్రసాదాల రుచో గానీ గుడంటే చిన్నప్పుడు ఎంతిష్టమో!

వయసుతో ఇష్టాలు మారినట్టు నేను తొమ్మిదో తరగతికి వచ్చేటప్పుడికి దేవుడు లేడని వాదించడం మొదలెట్టాను.

నేను రామాయణ విష వృక్షం చదువుతున్నాని తెలిసి మా నాయనమ్మ లబలబలాడింది .

ఇద్దరం వాదించుకున్నాం. అప్పుడు ఆవిడేమందో గుర్తులేదు గానీ నువ్వు రంగనాయకమ్మ కాలిగోరుకి కూడా చాలవని అన్నప్పుడు చిట్టెమ్మ కళ్లల్లో కనిపించిన నీటి పొర మాత్రం ఇప్పటికీ గుర్తుంది. ఆ రోజు నా మాటలు గుర్తొస్తే నేను మనిషినేనా అనిపిస్తుంది .

ఇప్పుడు దేముడ్ని నమ్మినా నమ్మకపోయినా ఒకటిమాత్రం నిజం. అమ్మవారి కళకళలాడే రూపాన్నీ, బీదరికాన్ని చూస్తే నిజమైన కమూనిస్టులా మాట్టాడే చిట్టెమ్మని గానీ, మా వూరి గుడి ప్రసాదాల రుచినిగానీ, మా ఆచార్లు గారు గుడి అరుగులమీద చెప్పిన చదువుగానీ మర్చిపోతే నేను మనిషినే కాదు. అయినా చిట్టెమ్మ మనవరాలు మనిషికాకుండా ఎట్టా వుంటంది .

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments